

ఎక్స్ గ్రేషియా చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు నగరపాలక సంస్థలో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తూ మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను మేయర్ ఎస్.అముద గురువారం పంపిణీ చేశారు. నగరపాలక సంస్థలో అవుట్ సోర్సింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఆర్.మురుగన్, ఎ.శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు పరిహారం అందించెందుకు కమిషనర్ డాక్టర్ జె.అరుణ చర్యలు తీసుకున్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న మేయర్ అముద

భానుడి భగభగలు...

- నిప్పుల కుంపటిలా జిల్లా..
- ఈనెల 18 నుంచి ఒంటిపూట బడులు



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఏడాది మార్చి నెల రెండో వారంలోనే ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. ఉదయం 11 తరువాత అడుగు బయటపెట్టాలంటేనే భయపడేంతగా ఎండలు ప్రతాపం చూపుతున్నాయి. చాలా వరకు ప్రజలు 12 నుంచి 4 గంటల వరకు ఇళ్ల పరిమవుతున్నారు. మార్చిర ఎండో వారంలో 37 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఇక ఏప్రిల్ నాటికి మరింత ఉష్ణోగ్రతు పెరిగే అవకాశాలున్నాయని జనం బెంబేలెత్తిపోతున్నారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్యఆరోగ్యశాఖ పలు జాగ్రత్తలు తీసుకోవల్సింగా సూచిస్తోంది.

వేసవి ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అత్యవసరమైతే తప్ప ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటి నుంచి బయటకు రాకూడదని తెలిపారు. అలాగే పాఠశాల విద్యార్థులు, పిల్లలు, గర్భిణులు వీలైనంత వరకు చల్లటి ప్రదేశాల్లోనే ఉండాలని, రోజుకు కనీసం మూడు లీటర్ల సురక్షిత మంచినీటిని తీసుకోవాలని తెలిపారు. ఎండ తీవ్రతతో శరీరంలోని నీటిశాతం తగ్గి వడదెబ్బకు గురైతే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెంటనే తరలించి చికిత్స అందించాలన్నారు.

నిప్పుల కుంపటే...

పెరుగుతున్న ఉష్ణోగ్రత, ఎండల తీవ్రత జిల్లాలోని ప్రధాన నగరాల్లో జనాభా ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. జిల్లా కేంద్రమైన చిత్తూరులో గురువారం 37సిసి ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ వారం రోజుల్లో సరాసరి 37సిసిగా నమోదయ్యింది. గ్రామీణ ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి పనుల నిమిత్తం పట్టణానికి వచ్చేవారు ఉదయాన్నే వచ్చి పనులు పూర్తి చేసుకుని ఉదయం 11 గంటలోపు గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. నగరవాసులు ఏసీలు, ఎయిర్‌కూలర్లకు పరిమితం అవుతున్నారు. దంచికొడుతున్న ఎండలతో ఏసీలకు, కూలర్లకు గిరాఖీ బాగా పెరుగుతోంది. మరోవైపు శీతల పానియాలకు అదేస్థాయిలో గిరాకీ పెరగడంతో రోడ్లకు ఇరువైపుల శీతలపానీయాలు, కర్బూజ, పుచ్చకాయల బండ్లు వెలిశాయి.



18 నుండీ ఒంటిపూట బడులు

మండిపోతున్న ఎండల నుంచి విద్యార్థులకు ఉపసమనం కల్పించేలా ఈనెల 18వ తేదీ సోమవారం నుండీ విద్యాశాఖ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు, యాజమాన్య పాఠశాలలకు ఒంటిపూట మాత్రమే బడులు నడపనున్నారు. మండిపోతున్న ఎండల్లో గాలి వెలుతురూ... ఫ్యాన్లు లేని గదుల్లో ఉక్కపోతలతో అల్లాడిపోతున్న విద్యార్థులకు ఈనెల 18 నుండీ ఒంటిపూట బడులు కాస్త ఉపసమనం కలుగనుంది.

పర్మినెంట్ అవుట్‌సోర్సింగ్

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ అరుణకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పర్మినెంట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు, మేస్త్రీల సమస్యలు పరిష్కరించాలని, సంక్రాంతి కానుక రూ.1000లు చెల్లించాలని గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అరుణకు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పర్మినెంట్ సిబ్బందికి సరెండర్ లీవులు, జిపిఎస్ అకౌంట్ వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చాలా సంవత్సరాలుగా పనిచేస్తున్న మేస్త్రీలకు ఉద్యోగభద్రత కల్పించడంతోపాటు వారికి సూపర్వైజర్ ప్రమోట్ చేసి అందుకనుగుణంగా జీతభత్యాలు చెల్లించే విధంగా ప్రభుత్వానికి సిఫార్సులు చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారం చేస్తానని సంక్రాంతి కానుక రూ.1000లు వెంటనే ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు వాడ గంగరాజు, నాయకులు నాగరాజు, విజయకుమార్, సుబ్రహ్మణ్యం, గణపతి సాయి పాల్గొన్నారు.

ఏపిపిఎస్‌సి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

హెల్ప్ డెస్క్ ఏర్పాటు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఏపీపీఎస్సీ పరీక్షలు ఈనెల 17న జిల్లాలోని మూడు కేంద్రాలలో నిర్వహించబడుతున్నాయని, ఈపరీక్షల నిర్వహణకు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయడమైనదని జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,518 మంది అభ్యర్థులు మూడు పరీక్షా కేంద్రాలైన ఎస్‌విసెట్, ఆర్‌విఎస్ నగర్, సీతమ్స్ కాలేజీ, చిత్తూరు, పివికెఎన్ డిగ్రీ కళాశాల, చిత్తూరులో ఏర్పాటు చేసిన 120 పరీక్ష హాల్‌లలో పరీక్షలు రాయనున్నారని తెలిపారు. గ్రూప్ పరీక్షలకు సంబంధించి పేపర్ 1 ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్ 2 మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. పేపర్ -1 పరీక్షల కొరకు అభ్యర్థులను ఉదయం 9 నుండి 9.45 వరకు, పేపర్ -2 కొరకు మధ్యాహ్నం ఒంటి గంట నుండి మ.1.45 వరకు మాత్రమే పరీక్షా కేంద్రాలలోకి అనుమతించడం జరుగుతుందని, క్షణం ఆలస్యం అయినా అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. పరీక్షాల నిర్వహణ, పర్యవేక్షణ కొరకు లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్‌లను ఏర్పాటు చేయడమైనదన్నారు. అబ్జెక్టివ్ టైప్‌లో నిర్వహించే పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి అయ్యాయని, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశాల మేరకు సీసీ కెమెరాలు నియంత్రణలో ఈ పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. పరీక్షా సమయంలో పరీక్షా కేంద్రాలలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేలా, ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఉండేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు కావాల్సిన ఓఆర్ఎస్ పాకెట్, ఇతర వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసేలా వైద్య ఆరోగ్యశాఖను ఆదేశించడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రంలోకి హాల్ టికెట్, బాల్ పెన్ మినహా ఎటువంటి వస్తువులు అనుమతించరని అన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్ కేంద్రాలను మూసివేయించి 144 సెక్షన్ చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. అభ్యర్థుల కొరకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వివరాలు, పరీక్ష సమయం తదితర వివరాలలో సందేహాల నివృత్తికి కలెక్టరెట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం:9491077356కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.

సచివాలయం ప్రారంభం




ప్రజాశక్తి- చిత్తూరు డెస్క్: నియోజవర్గంలో జరిగే అభివృద్ధిని చూడండి.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఆదరించండి అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం మండలంలోని అడవికొత్తూరు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, తుడా నిధులు రూ.20లక్షలతో నిర్మించిన కాలువను ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించే సిమెంటు రోడ్డుకు ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పాలనలో ఎన్ని అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఎంత మందికి సంక్షేమం అందుతో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారన్నారు. ఒక్క అడవికొత్తూరు సచివాలయ పరిధిలోనే డీబీటీ, నాన్ డీబీటీ కింద రూ. 14.76 కోట్లు అభివృద్ధి పనులు జరిగిందన్నారు. జరిగిన ప్రతి అభివృద్ధి గణాంకాలతో సహా చూపడం జరిగిందన్నారు. విద్య, వైద్యం, గూడు అన్నీ ప్రజలకు ఎలాంటి అవాంతరాలు లేకుండా అందుతోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



ప్రజాశక్తి - వెదురుకుప్పం /ఎస్ఆర్ పురం: మండలంలోని పలు అభివృద్ధి పనులను రాష్ట్ర డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సర్పంచ్ డివి డిల్లెయ్య, మాజీ సర్పంచ్ విజయబాబు, ఎంపీటీసీ సుజాత ఆధ్వర్యంలో ప్రారంభించారు. గురువారం కొత్తపల్లి గ్రామ పంచాయతీలలో వాటర్ ట్యాంక్, వైయస్సార్ హెల్త్‌విలేజ్ క్లినిక్, సిసి రోడ్లు, మిల్క్ సెంటర్‌ను ప్రారంభించారు. జడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ సరిత, డిసిసిబి బ్యాంక్ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, వైస్ సర్పంచ్ సుందరం, పి.దామోదరం, గోవిందరెడ్డి, దేవరాజు రెడ్డి, మార్కొండయ్య, కుప్పయ్య, మణి, జనార్దన్, భూపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో దేవరాజులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వబడిలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులలో బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే ఎక్కువ ఉన్నారని వారి విద్య కోసం ప్రతి ఉపాధ్యాయులు శ్రమించాలని ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానానికి రావాలని అన్నారు. అందుకు ప్రతి ఒక ఉపాధ్యాయుడు శ్రమించాలని ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షెడ్యూల్‌కు ముందే సిద్ధం కావాలి : కలెక్టర్



ఎన్నికల ఏర్పాట్ల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షన్మోహన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుండి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్, వివిఎస్‌టి టిమ్స్ సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. గురువారం ఉదయం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి.పి.శ్రీనివాసులు, డిఆర్ఓ బి.పుల్లయ్యలతో కలసి 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నోడల్ ఆఫీసర్స్‌తో ఎన్నికలకు సంబంధించి వివిధరకాల టిమ్స్ నియామకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుండి ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వైలెన్స్, వివిఎస్‌టి, మెటీరియల్ మేనేజ్మెంట్, రిస్పన్ మేనేజ్మెంట్, వివిధ రకాల టిమ్స్ అన్ని సిద్ధంగా ఉండాలని నోడల్ ఆఫీసర్స్‌ను ఆదేశించారు. ఏడు నియోజకవర్గాలకు వివిధ రకాల టీమ్స్‌ను సిద్ధం చేయాలని, టీమ్స్‌కు సంబంధించి అధికారులు వారికి కేటాయించిన సహాయాలను సిబ్బందికి ఉత్తర్వులు అందజేయాలని డిఆర్ఓను ఆదేశించారు. జిల్లాకు వచ్చే ఎన్నికల పరిశీలకుల, వివిధ రకాల టీములకు వాహనాలు సిద్ధంగా ఉంచాలని డిటిసిని ఆదేశించారు. ఎస్‌వి సెట్ నందు ఏర్పాటు చేసే కౌంటింగ్ కేంద్రంలో బ్యారికెట్ల, వివిధ రకాల మౌలిక సదుపాయాలు ఏర్పాట్లు చేయాలని ఆర్ అండ్ బి, ఎస్ఈని ఆదేశించారు. జిల్లాలో క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్ పెండింగ్ అంశాల క్లియరెన్స్ చేయాలని ఎఫ్ఎస్ఓను ఆదేశించారు.

వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా జిల్లాలో 23,215 మందికి

రూ.34.82 కోట్లు లబ్ధి : జెసి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వైఎస్సార్ ఇబిసి నేస్తంను గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఈ కార్యక్రమాన్ని చిత్తూరు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, నగర పాలకసంస్థ మేయర్ అముదా, బిసి.కార్పొరేషన్ ఈడి.బి.శ్రీదేవి పాల్గొన్నారు. జెసి మాట్లాడుతూ 45 నుండి 60 ఏళ్ల మధ్య వయసు గల ఇబిసి సామాజిక వర్గంకు చెందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్యేశంతో సంవత్సరానికి రూ.15వేలు చొప్పున మూడు సంవత్సరాలు రూ.45వేలు నిధులు లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి 23,215 మంది లబ్ధిదారులకు గాను రూ.34.82 కోట్లను నిధులను విడుదల చేసినట్లు తెలిపారు.



వైఎస్ఆర్ ఈబిసి నేస్తం మెగా చెక్కులు పంపిణీ చేస్తున జెసి శ్రీనివాసులు

పెద్దిరెడ్డి ప్రచారానికి శ్రీకారం



ప్రజాశక్తి- పుంగనూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికలకు ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పట్టణ పరిధిలో ఉన్న హనుమంతురాయి దీన్నిలో వెలసి ఉందు ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ ప్రచారాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా నియోజకవర్గంలోని ఆరు మండలాల నుండి ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు, హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించిన తర్వాత పాదయాత్రతో ప్రకాశం కాలనీ, ఎన్ఎస్ పేట, దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించుకుని, బ్రాహ్మణ వీధి, రాతి మసీదు వీధి, నాగపాల్యం, ఎంపీటీ రోడ్డులో ప్రచారం నిర్వహించారు. అనంతరం షాదీ మహల్లో రెండవ నూతన కళ్యాణ మండపంను ప్రారంభించారు. మైనార్టీ సోదరుల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ హాలీం బాష, పీకే ఎం ముడా ఛైర్మన్ వెంకట్ రెడ్డి యాదవ్ పాల్గొన్నారు.

వైసిపి పంచిన చీరలు బీసీవై పార్టీవే ..

ప్రెస్‌మీట్‌లో నేతల ధ్వజం



ప్రజాశక్తి- పుంగనూరు: నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ పంచుతున్న చీరలు బీసీవై పార్టీవేనని, ఇంత నీచరాజకీయాలకు దిగజారుదు మంచిది కాదని ఆ పార్టీ నేతలు మాజీ ఏఎంసీ ఛైర్మన్ హరినాథ్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ చెనకంటి సాంబ మూర్తులు ధ్వజమెత్తారు. ఎల్ఐసి కాలనీ సునంద నిలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ 2019 ఎన్నికల తర్వాత బిసివై పార్టీ సంక్రాంతి కానుకగా పుంగనూరు నియోజకవర్గంలోని అక్కచెల్లెమ్మలకు పండుగ సంతోషంగా జరుపుకోవాలని ఇచ్చేందుకు 73వేలు చీరలు తెప్పించగా వాటిని పోలీసులు నకిలీ మద్యంపెట్టి, అక్రమంగా కేసు బనయించారని చెప్పారు. అప్పుడు సీజ్ చేసిన చీరలన్నీ పోలీసులు అధీనంలో ఉన్నాయనుకున్నామని కానీ ఇప్పుడు వైసిపి నాయకులు వాలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం సిగ్గుచేటు అన్నారు. మేము కొనుగోలు చేసిన చీరలన్నింటికీ బిల్లులు, ట్రాన్స్‌పోర్ట్ బిల్లులు, చీరలు కొన్నందుకు పన్ను చెల్లించిన బిల్లులన్నీ తమ వద్ద ఉన్నాయని ఈ సందర్భంగా చూపించారు. తాము కొన్న చీరలు వైసీపీ ఎలా పంపిణీ చేస్తుందని, పోలీసు వ్యవస్థ ఏంచేస్తుందని ప్రశ్నించారు. వారు చేస్తే రాజకీయం మేము చేస్తే ఇంకొకటి అంటూ మండిపడ్డారు.

నాడు వ్యర్థాలు.. నేడు పచ్చదనం

చెత్త పడేసే ప్రాంతంలో.. మొక్కలు నాటిన స్థానికులు.. .




వ్యర్థాలు పడేసే ప్రాంతాల్లో మొక్కలు నాటిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నిన్నటి వరకు అక్కడ అంతా వ్యర్థాలను కుప్పలుగా పడేసేవారు. నేడు ఆ ప్రాంతం పచ్చని మొక్కలతో పరిశుభ్రంగా మారింది. పరిశుభ్రత వైపు అడుగులు వేస్తూ స్థానిక ప్రజలు మిట్టూరు తహశీల్దార్ కార్యాలయం రోడ్డు వద్ద ఉన్న అపరిశుభ్ర ప్రాంతాన్ని శుభ్రంగా సుందరంగా మార్చారు. నగరంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రంగా చేసి.. మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశాల మేరకు.. నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు మిట్టూరులో వ్యర్థాలతో నిండిన ప్రాంతాన్ని స్థానికుల భాగస్వామ్యంతో పరిశుభ్రంగా మార్చారు. వ్యర్థాలను రోడ్డుపై కుప్పలుగా పడేయడం వల్ల కలిగే అనర్థాలపై స్థానికులకు అవగాహన కల్పించి వ్యర్థాలను తొలగించారు. స్థానికుల సహకారంతో నిరుపయోగమైన డ్రమ్ములను ఏర్పాటు చేసి అందులో పూలమొక్కలను నాటారు. ఇక్కడ ఎవరూ చెత్త పడేయరాదని బోర్డు పెట్టారు. చెత్తను రోడ్లపై పడేయవద్దని, తడి, పొడిగా వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందివ్వాలని ఇన్చార్జి ఎంహెచ్వో చిన్నయ్య కోరారు. కార్యక్రమంలో వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రిలు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ నియమావళి మేరకు విధులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రతి ఉద్యోగి ప్రజాస్వామ్యస్ఫూర్తితో ఎన్నికల విధులను నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం పివికెఎన్ కళాశాల ఆడిటోరియంలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు జేసి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రతి ఉద్యోగి గర్వపడే విధంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల నిర్వహణ తగిన ఏర్పాట్లను సెక్టొరల్ అధికారుల ద్వారా పూర్తి చేయడం జరుగుతుందని, ఎన్నికల విధులను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే ప్రతి ఉద్యోగికి పోస్టల్ బ్యాలెట్ పొందే అవకాశం ఉందన్నారు. ఎన్నికల విధుల నుండి బాలింతలు, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాల రోగులకు, దివ్యాంగులకు మినహాయింపు ఉంటుందని మిగతా అందరూ తప్పనిసరిగా ఎన్నికల విధుల్లో పాల్గొనాలన్నారు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఇతర పోలింగ్ సిబ్బంది సమన్వయంతో కలిసి ఎన్నికల సామాగ్రి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రిసైడింగ్ అధికారులు ఇతర పోలింగ్ సిబ్బంది అనుసరించాల్సిన విధివిధానాలను ఎన్నికల మ్యాన్యువల్‌లో పొందుపరచడం జరిగిందని, పూర్తిస్థాయిలో మాన్యువల్‌ను చదివి అవగాహన చేసుకుని ఎన్నికల నిర్వహణకు వెళ్లాలన్నారు. ఈ శిక్షణా తరగతులలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాష, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారిని భవాని, డ్వామా ఏపీడీలు ఉమాదేవి, చిన్నరెడ్డన్న, తదితర మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

గిరిజనులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



ప్రజాశక్తి- పుంగనూరు: అటవీ భూమిని ఇళ్ల నిర్మాణం కోసం 18 గిరిజన కుటుంబాలకు ఇంటి పట్టాలను మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి అందజేశారు. మండలంలోని మేలుందొడ్డి గ్రామంలో సచివాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో గిరిజన కుటుంబాలు గురువారం పట్టాలు పంపిణీ చేశారు. గంగవరం మండలం కీలపట్ల గ్రామపంచాయతీ కుయ్యా వంక 320 కంపార్ట్మెంట్‌లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు అటవీ హక్కుల చట్టం 2006 కింద జిల్లా కలెక్టర్ వారికి పట్టాలు మంజూరు చేయగా ఈ పట్టాలను మంత్రి పెద్దిరెడ్డి చేతుల మీదుగా గిరిజన కుటుంబాలు అందుకున్నారు. చిత్తూరు పార్లమెంట్ సభ్యులు రెడ్డప్ప, జిల్లా అటవీశాఖ అధికారి చైతన్యకుమార్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ సాధికారతాధికారి ఎన్.మూర్తి, పలమనేరు, పుంగనూరు ఫారెస్ట్ అధికారులు శివన్న, బాలకృష్ణారెడ్డి, ఎంపీపీ అక్కిసాని భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్య ద్వారానే బంగారు భవిష్యత్: ఎంఈవో



ప్రజాశక్తి- యాదమరి: విద్య ద్వారా విద్యార్థులు బంగారు భవిష్యత్తు అందిపుచ్చుకోవాలని మండల విద్యాశాఖ అధికారి రుక్మిణి తెలిపారు. గురువారం కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో హెచ్‌ఎం లలిత ఆధ్వర్యంలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కె.గొల్లపల్లె పాఠశాలను అభివృద్ధి చేసి మండలలోనే మొదటిస్థానం రావడానికి హెచ్‌ఎం లలితతో పాటు ప్రతి ఉపాధ్యాయుని కృషి అభినందనీయమన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలలో మొదటి స్థానంలో నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో హెచ్‌ఎల్‌ఎన్.ప్రసాద్, బంగారుపాళ్యం ఎంఈవో రమేష్ బాబు, మంగళపల్లె హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలం కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ ఎం.దొరస్వామి గురువారం ఆధ్వర్యంలో ఇందిరమ్మ అభయహస్తం వంటి పథకాలను ప్రజలకు తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి రూ.5వేలు గ్యారంటీ స్కీమ్, ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఏ ఇతర పార్టీలకి దీన్ని సాధించడం ఇవ్వడమో సాధ్యం కాదని అన్నారు. ఇందిరమ్మ అభయ హస్తం కరపత్రాలను పెద్దపంజాణి మండలంలోని పెద్దరికుంట, చిన్నారి కుంట, లింగాపురం, దొరబల్లి, నకిరేపల్లి తుర్లపల్లి కొలతూరు దిన్నేపల్లి, పెద్దపంజాణి గ్రామాలలో పంచిపెట్టారు. రమణారెడ్డి, సుబ్రమణ్యం, మల్లప్ప, రెడ్డప్ప, శంకర్ కుమార్ పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

ప్రజాశక్తి- పెద్దపంజాణి: మండలంలోని పెద్దవెలగటూరు గ్రామపంచాయతీకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఆర్.నాగరాజు రెడ్డి కుటుంబీకులను మాజీ మంత్రి అమరనాథ రెడ్డి గురువారం పరామర్శించారు. నాగరాజు తండ్రి ఆర్.కృష్ణారెడ్డి రెండు రోజుల క్రితం మృతిచెందారు. కృష్ణారెడ్డి మృతి విషయం తెలిసినా మాజీ మంత్రి అందుబాటులో లేకపోవడంతో అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు. దీంతో గురువారం స్థానిక టిడిపి నాయకులతో కలిసి వెళ్లి ఆయన నాగరాజు రెడ్డి కుటుంబీకులను పరామర్శించారు.

టిడిపిలోకి వైసిపి నేత కోలా కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరపాలక కో–ఆప్షన్ సభ్యుడు, వైసిపి జేసీఎస్ మండల కన్వీనర్ కోలా కిరణ్ కుమార్ గురువారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ కార్పొరేటర్‌గా ఉన్న ఆయన ప్రస్తుతం చిత్తూరు బలిజ సంఘం ఉపాధ్యక్షులుగా ఉన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విజయవాడలో కండువా కప్పి కిరణ్ కుమార్‌ను టిడిపిలోకి ఆహ్వానించారు. చిత్తూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి గురజాల జగన్ మోహన్ గెలుపునకు శక్తి వంచన లేకుండా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నవీన్, వాసు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరులో ట్రాఫిక్ సమస్య

ప్రజాశక్తి- పలమనేరు



పలమనేరులో రోజురోజుకు ట్రాఫిక్ పెరుగుతూనే ఉంది. దీనిపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు పోలీసులకు విన్నవించుకున్నా పట్టించుకున్నపాపానపోలేదు. ఉదయం, సాయంత్రం కళాశాలలు, స్కూల్స్, ఉద్యోగులు వచ్చి వెళ్లే సమయాల్లో స్థానిక క్లాక్ టవర్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ట్రాఫిక్ వలన గతంలో పలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. కనుక ఇకనైనా పోలీసు అధికారులు స్పందించి క్లాక్ టవర్ వద్ద ఓ ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను నియమించి ప్రజలకు ఇబ్బందిలేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

బెదిరింపులకు భయపడం...

సీకే బాబుతో పాటు మరొకరిపై వన్‌టౌన్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: తెలుగుదేశం పార్టీ నాయకుల బెదిరింపులకు తాము భయపడమని వైఎస్సార్‌సిపి నాయకులు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చిత్తూరు నగరం 9వ డివిజన్ పరిధికి చెందిన ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజలిరెడ్డితో ఆమె భర్త కె.ప్రభాకర్ రెడ్డికి గురువారం మధ్యాహ్నం 12.01 గంటలకు ఫోన్ ద్వారా బెదిరించారని ఆరోపిస్తూ శేషాద్రి నాయుడుతో పాటు చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబుపై స్థానిక వన్‌టౌన్ పోలీస్‌కు గురువారం ఫిర్యాదు అందింది. ఈసందర్భంగా అంజలిరెడ్డి, ఆమె భర్త ప్రభాకర్ రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా మాజీ అధ్యక్షురాలు పివి గాయత్రీదేవి మాట్లాడుతూ... ఇంటింటికీ వెళ్తూ ప్రజల ఆదరాభిమానాలతో విజయం సాధించాలి కాని, అందుకు విరుద్ధంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఎన్నికల్లో విజయం సాధించాలనుకోవడం హేయమైన చర్యగా అభివర్ణించారు. టిడిపి నాయకులు శేషాద్రి నాయుడు సెల్‌ఫోన్ నుంచి మాజీ ఎమ్మెల్యే సీకే.బాబు ప్రభాకర్‌రెడ్డికి ఫోన్‌చేసి వైసిపికి అనుకూలంగా ఎన్నికల ప్రచారానికి వెళ్లకూడదని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి బెదిరింపు ఫోన్‌కాల్స్‌కు తాము ఏమాత్రం భయపడబోమని, అదే క్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి విజయానందరెడ్డి విజయానికి తమవంతు ప్రచారం చేసి... ఆయనను చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిపించుకుని తీరుతామని స్పష్టం చేశారు. సమావేశంలో అన్బురాజ్, కెపి శ్రీధర్, షుకూర్ అను, దళవాయి శివకుమార్, మురకంబట్టు చిన్ని, కేఎంసీ ప్రసన్న, శాంతి తదితరులు పాల్గొన్నారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వైసిపి నేతలు

ఇంటింటి ప్రచారంలో 'థామస్'



ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు

గంగాధర నెల్లూరులో ఈసారి నారాయణస్వామి కుమార్తె వైసీపీ అభ్యర్థి కృపాలక్ష్మిని ఓడించి, టీడీపీ సత్తా ఏమిటో చేసి చూపిస్తామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, జనసేన ఇన్చార్జి యుగంధర్‌లు అన్నారు. మండల పరిధిలోని వింజం పంచాయతీకి చెందిన సిద్దేశ్వర కొండలో మీ ఇంటికి మీ థామస్, టిడిపి సూపర్ సిక్స్ పథకాలపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా థామస్ సమక్షంలో వింజం, బాలగంగనపల్లె పంచాయతీలకు చెందిన వైసిపి నేతలు కన్నారెడ్డి, యువరాజా రెడ్డి, మురళీ రెడ్డితోపాటు 50 మంది కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ కండువాను కప్పుకున్నారు. అలాగే మేదవాడకు చెందిన విశ్వనాథ నాయుడుతో పాటు మరో 20 మంది టిడిపితో చేరారు. వీరికి టిడిపి కండువా కప్పి థామస్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కృష్ణమ నాయుడు, స్వామిదాస్, శ్రీధర్ యాదవ్, దేవ సుందరం, జ్యోతి యాదవ్, నీరజాక్షులురెడ్డి, పుష్పరాజ్ పాల్గొన్నారు.

పూతలపట్టు టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్ మురళీ మోహన్‌కే..

ప్రజాశక్తి- యాదమరి: పూతలపట్టు నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ కలికిరి మురళిమోహన్ పేరు ప్రకటించడంతో ఆ పార్టీ శ్రేణులు గురువారం మండల కేంద్రంలో బాణాసంచలు కాల్చి, స్వీట్లు పంచి సంబరాలు చేశారు. రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిదే విజయమని మురళి మోహన్ స్పష్టం చేశారు. నియోజకవర్గం వాసినైన తనపై టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు నమ్మకం ఉంచి టిడిపి అభ్యర్థిగా ప్రకటించడం అదృష్టంగా భావిస్తున్నానని, చంద్రబాబు నాయుడు, లోకేష్‌కి పూతలపట్టు గెలుపును బహుమానంగా ఇస్తానని అన్నారు.



జగన్‌ది తుగ్లక్ పాలన : కలికిరి మురళిమోహన్

అసెంబ్లీ ఎన్నికలకు మరికొద్ది రోజులే ఉండడంతో పూతలపట్టు నియోజకవర్గంలో టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళిమోహన్ స్పీడ్ పెంచారు. మండలంలోని ఓటేరు పంచాయతీ పరిధిలోని కాసరాల కొత్తూరు, మంగళపల్లె, ఓటేరుపల్లె, కే.కొత్తూరు దళితవాడ గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మురళిమోహన్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ 6 గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంచి పెట్టారు. మండల అధ్యక్షుడు మొరార్జీ, కార్యదర్శి రబ్బి, ఓటేరుపల్లి సర్పంచ్ భగవతి రాజేంద్రనాయుడు పాల్గొన్నారు

విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సరస్వతి పూజ అనంతరం ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పదవ తరగతి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు తొలిమెట్టుగా భావించాలని బాగా చదివి పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యార్థులను కోరారు. పాఠశాల సిబ్బంది షకీల్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు గౌడ్ సుల్తాన్ ఆధ్వర్యంలో గురువారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం 10వ తగరతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులందరూ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఉపాధ్యాయులు కె.వాసు, సంగీత, తదితరులు పాల్గొన్నారు.



క్రైం న్యూస్

పూరి గుడిసె దగ్ధం

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వీఆర్వో

ప్రజాశక్తి- సోమల:



మండలం పెద్దఉప్పరపల్లి పంచాయతీ టిఎం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఏ మంజుల ఆచారికి చెందిన పూరి గుడిసె బుధవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. ఇదే ప్రమాదంలో పక్కనే ఉన్న గడ్డివామి కూడా అగ్నికి ఆహుతి అయినట్లు వీఆర్వో శ్రీరాములు తెలిపారు. వివరాల్లోకి వెళితే బుధవారం అర్ధరాత్రి 2.30గంటల ప్రాంతంలో పూరి గుడిసెలో మంటలు చెలరేగాయి. పూరిగుడిసె యజమాని మంజుల తన భర్త ఊరికి వెళ్లడంతో సమీపంలోని బంధువుల ఇంటిలో పడుకొని నిద్రపోయింది. సుమారు రాత్రి 2 గంటల ప్రాంతంలో పూరి గుడిసెలో మంటలు గుర్తించిన గ్రామస్తులు మంటలను ఆర్పేందుకు విశ్వప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోగా పక్కనే ఉన్న గడ్డివామికి కూడా మంటలు వ్యాపించడంతో అటు పూరిగుడిసె ఇటు గడ్డివామీ పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. గురువారం ఉదయం మంజుల వీఆర్వో శ్రీరాములుకు విషయాన్ని తెలుపగా ఆయన సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల తన పూరి గుడిసెలో 52 వేల రూపాయల నగదు, 20 గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి, బియ్యం, దుస్తులు ఇంటిలో ఉన్న ఇతర సామాగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయాయని తెలిపారు. మంజుల వివరాల మేరకు నివేదికలను సిద్ధం చేసి తహాశీల్దార్‌కు అందజేయనున్నట్లు వీఆర్వో మునీశ్వర తెలిపారు.

భూతగాదాల్లో ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: భూతగాదాల్లో ఇద్దరికీ గాయాలైన సంఘటన గురువారం మండలంలోని బోడబండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లికార్జున ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బోడబండ్ల గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు వాసు, నరసింహులు కుమారుడు మురళి, పట్టాభికి పొలం వద్ద గొడవలు ఉన్నాయి. దీంతో గురువారం వాసు అనే వ్యక్తి మండల సర్వేలను పిలిపించుకుని భూ సర్వే చేపట్టాడు. ఇందులో హద్దులకు సరిపోయే విధంగా ఉందని సర్వే తేల్చడంతో ఆగ్రహించిన వాసు తన వద్ద ఉన్న కత్తితో మురళి, పట్టాభిలాపై ఘర్షణకు దిగి తలపై గాయపరిచాడు. దీంతో వారిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.


ద్విచక్రవాహనాలు ఢీ

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: మండలంలోని పలమనేరు– కుప్పం జాతీయ రహదారి పరిధిలోని దేవదొడ్డి రైతు భరోసా కేంద్రం మలుపు వద్ద బుధవారం రాత్రి 11 గంటలకు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మిట్టకూరపల్లి గ్రామానికి చెందిన చంద్రప్ప (45), దేవదొడ్డి గ్రామంలో పాలు పోసి తిరిగి వెళుతున్న సమయంలో బైరెడ్డిపల్లిలో కార్పెంటర్‌గా పనిచేస్తున్న షణ్ముగంఆచారి (45) పనులు పూర్తి చేసుకుని కొమ్మరిమడుగు వెళుతుండగా ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడటంతో స్థానికులు వారిని 108 ద్వారా పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైరెడ్డిపల్లి ఎస్సైగా కృష్ణయ్య

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ఎస్సైగా ఈ. కృష్ణయ్య గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎస్సైగా పనిచేస్తున్న మోహన్ కుమార్ ఉన్నతాధికారి ఆదేశాల మేరకు సీఐగా ఉద్యోగ్యోన్నతి రావడంతో బదిలీ పైన వెళ్లారు. రొంపిచర్ల మండలంలో ఎస్సైగా పనిచేస్తున్న ఈ.కృష్ణయ్య బదిలీపై బైరెడ్డిపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చట్టానికి లోబడి ఉండి ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేస్తానని తెలిపారు. మండల ప్రజలు శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు.



తేనెటీగల పెంపకంతో అధిక లాభం: డాకర్ రమణ

ప్రజాశక్తి-క్యాంపస్: తేనెటీగల పెంపకం ద్వారా అధిక లాభం పొందవచ్చునని సహ వ్యవసాయ పరిశోధనా సంచాలకులు డాక్టర్ రమణ అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మైక్రోస్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్ సంయుక్తంగా నిర్వహించిన తేనెటీగల పెంపకంపై రెండు రోజుల రాష్ట్రస్థాయి సదస్సు గురువారం సెమినార్ హాల్లో నిర్వహించారు. డాక్టర్ రమణ సభను ఉద్దేశించి మాట్లాడుతూ తేనె యొక్క ఉపయోగాలు ఔషధ గుణాలు తేనెటీగల పెంపకం ద్వారా తయారయ్యే వివిధ ఉత్పత్తుల గురించి తెలిపారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన ఎస్వీ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సు ద్వారా తేనెటీగల పెంపకంలోని మెలకువలను తెలుసుకుని తేనె ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేసుకుని అధిక లాభాలను పొందాలని కోరారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ నాణ్యమైన, స్వచ్ఛమైన తేనెను తయారుచేసి ప్రభుత్వం ద్వారా ధ్రువీకరణ పొందడం వలన అధిక రాబడి పొందవచ్చని తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తేనె ఉత్పత్తిలో కృషి చేయడమే కాక రైతాంగం రైతు ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసుకొని సన్న కారు వ్యాపారస్తులతో సంధి కుదుర్చుకొనటం ద్వారా తమ ఉత్పత్తిని అధిక ధరలకు విక్రయించుకోవచ్చని తెలిపారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ కేవలం తేనె తయారీ కాకుండా ఉప్పొడి తేనెటీగల నుంచి వచ్చే మైనపు యొక్క ఉత్పత్తులు, ఇతర విలువ ఆధారిత ఉత్పత్తులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ రైతుల సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఈ సదస్సు ద్వారా తేనెటీగల పెంపకంలోని సాధక బాధకాలు, లాభనష్టాలను గురించి అవగాహన తెచ్చుకుని ఆ తర్వాత తేనెటీగల పెంపకాన్ని ప్రారంభించాలని కోరారు.

గీతాంజలిది బలవన్మరణం: మోహిత్‌రెడ్డి

ప్రజాశక్తి-రామచంద్రాపురం:

నా కల వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ పాలనలో నెరవేరిందని తెనాలికి చెందిన గీతాంజలి సంతోషంగా చెప్పడమే ఆమె పాలిట శాపంగా మారిందని తుడా ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పేర్కొన్నారు. గీతాంజలి బలవన్మరణంతోనైనా సోషల్ మీడియా వేదికగా వేధింపులకు పాల్పడే వారికి కనువిప్పు కావాలన్నారు. మంచిని ప్రచారం చేసుకునేందుకు వినియోగించాల్సిన సోషల్ మీడియాను అభం శుభం తెలియని అమాయకురాలు ప్రాణాలను తీసుకునే విధంగా ట్రోల్స్ చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గురువారం విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద గీతాంజలి మృతి పట్ల ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావం తెలుపిన చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆమె చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, గీతాంజలి మృతికి కారకులైన రాక్షసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్త వార్తలు

సూర్యప్రభ వాహనంపై ఆదిదేవుడు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం

సూర్యప్రవాహనంపై గురువారం ఆదిదేవుడు భక్తులకు దర్శనమిచ్చారు. మహాశివరాత్రి సందర్భంగా పదవరోజు సూర్యప్రభ వాహనంపై ఆదిదేవుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా నల్లగాంపల్లికి చెందిన కేవీఎన్ ఫుడ్స్ యాజమాన్యం వ్యవహరించారు. సాయంత్రం ధ్వజఅవరోహణ, త్రిశూలస్థానం, రాత్రి చంద్రప్రభ వాహనసేవ ఉంటాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి మునిరాజులు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం...

ప్రజాశక్తి- పూతలపట్టు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గురువారం వైసిపి రాష్ట్ర నాయకులు బాబురెడ్డి, మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి సచివాలయం కన్వీనర్ సుధాకర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ద్వారకనాథ్ రెడ్డి, సర్పంచ్ మణి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ వేసవి తాపం అధికంగా ఉన్నందున రహదారి పక్కన వాహనాల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

ఓటు నమోదుపై అవగాహన

ప్రజాశక్తి- యాదమరి: ప్రజాస్వామ్యంలో విలువలు పెంచాలంటే ఓటు హక్కు తప్పనిసరి అని, ప్రతి ఒక కుటుంబంలో ఓటు వినియోగించుకోవాలని ఎంపీడీవో సింగన్న అన్నారు. గురువారం మండల సమైక్య కార్యాలయంలో ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రతి ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలకు ప్రతి ఒక్కరికి ఓటుపై పూర్తిస్థాయిలో సంఘ సభ్యులు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని తెలిపారు. ఏపీఎం కల్పనత రెడ్డి, వెలుగు సీసీలు బాలసుబ్రమణ్యం, లక్ష్మీపతి, వెంకటేష్, మంజుల పాల్గొన్నారు.

టిడిపి సంబరాలు

ప్రజాశక్తి- పుంగనూరు: పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డి పేరు ప్రకటించడంతో అభిమానులు సంబరాలు నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో చల్లా రామచంద్రారెడ్డి ఫ్లెక్సీ ఏర్పాటు చేసి సంబరాలు చేశారు. టిడిపి రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, వడ్డెర సంఘం అధ్యక్షులు మణి, నాగరాజు పాల్గొన్నారు.

పులిచెర్ల: పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థిగా చల్లా రామచంద్రారెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించడంతో గురువారం టిడిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండలంలోని కల్లూరు, ఎల్లంకి వారి పల్లె బస్టాండు కూడలికి చేరుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు టపాకాయలు పేల్చి స్వీట్లు తినిపించుకున్నారు. టిడిపి నాయకులు కుమార్ రెడ్డి, ధనుంజయ నాయుడు, మురళీధర్ నాయుడు, నూర్ బాషా, పూల రమేష్, మహేష్, మోహన్, బండ్ల రమేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరులో ఈనెల 16వ తేదీన శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను పట్టణంలోని జవలీవీధిలోని ఇండియన్ బ్యాంక్ బి సైడ్ సీనియర్ సివిల్ కోర్ట్‌లో నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి పి.శ్రీనివాసరావు ఓ ప్రకటనలతో తెలిపారు. 16వ తేదీ జరిగే లోక్ అదాలత్ ను పట్టణంలోని సీనియర్ సివిల్ కోర్ట్‌లో నిర్వహించనున్నామని, కక్షిదారులు ఈ విషయాన్ని గుర్తించి హాజరుకావాలని కోరారు.

రైతాంగ కార్మిక వ్యతిరేకి నరేంద్రమోడీ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రైతులు చేస్తున్న పోరాటం జయప్రదం చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లావ్యాప్తంగా సిఐటియు, రైతుసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిరసన గళం వినిపించారు. తిరుపతి పాత మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకూ సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రైతుల పోరాటాన్ని సంఘీభావంగా ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ దేశం టెక్నాలజీ పరంగా ఎంత అభివృద్ధి చెందినా, సగటు మనిషి అన్నం తినే జీవించాలి తప్ప కంప్యూటర్లు కూడు పెట్టవన్నారు. వరిని, గోదుమలను పండిస్తున్నర ఐతుల సమస్యలు పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస గిట్టుబాటు ధర కల్పిస్తామని, ఎరువుల, విత్తనాల సబ్సిడీ ఇస్తామని వాగ్దానం చేసిన మోడీ ప్రభుత్వం మాట తప్పారన్నారు. 2024, జనవరి 26న రైతులందరూ మోడీ చెప్పిన వాగ్దానాన్ని అమలు చేయాలని ఆరునెలలకు సరిపడా ఆహార ధాన్యాలను వెంట తీసుకని చలో ఢిల్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. ఈ పోరాటంలో శు భకరన్సింగ్ బలయ్యారన్నారు. నాయకులు చిన్నం పెంచలయ్య, పి.హేమలత మాట్లాడుతూ రాబోయే రోజుల్లో దేశంలో ప్రజలు ఏమీ కొని తినలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. కె.వేణుగోపాల్, టి.సుబ్రమణ్యం, ఎం.మాధవ్‌కృష్ణ, సాయిలక్ష్మి, చిన్నా, రాధాక్రిష్ణ, రమేష్, జయంతి, ఎండి రవి, కెవై రాజా, గోవిందస్వామి, కుడుము విజయ్‌కుమార్, రామిశెట్టి వెంకయ్య పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో పాత బస్టాండ్ సెంటర్ వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, సురేష్, ప్రసాద్ పాల్గొన్నారు. పుత్తూరు టౌన్‌లో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో వ్యవసాయ నల్లచట్టాలను రద్దు చేయాలని నిరసన తెలిపారు. కెఆర్ సుబ్రమణ్యం పిళ్లై, ఎ.విజయ్, ఎ.శివ పాల్గొన్నారు. తారకరామనగర్ రెడ్‌క్రాస్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, నాయకులు కె.హరినాథ్, పి.రాజశేఖర్, మస్తాన్, సుధ, పవిత్ర పాల్గొన్నారు.

మార్క్స్ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

దోపిడీ లేని సమాజ నిర్మాణానికి మార్క్సిజమే ఆయుధమని, ఈ సిద్ధాంతాన్ని ప్రజల్లోకి విస్తారంగా తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు అన్నారు. మార్క్స్ 141వ వర్ధంతి పురస్కరించుకుని తిరుపతి యశోదానగర్‌లో నివాళి అర్పించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ, ప్రజలను దోచుకుంటోందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మతోన్మాద బిజెపిని ఓడించడమే లక్ష్యంగా సిపిఎం శ్రేణులు విస్తారంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందారపు మురళి, టి.సుబ్రమణ్యం, కె.వేణుగోపాల్ పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... సిపిఎం కార్యాలయంలో మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రపంచ గమనాన్ని మార్చిన కారల్ మార్క్స్ సిద్ధాంతంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. సిపిఎం నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, సురేష్, టి.వెంకట రామిరెడ్డి, బి.చంద్రయ్య, అడపాల ప్రసాద్ పాల్గొన్నారు.

నాయుడుపేటలో... వేదనపర్తి సుందర రామిరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో నాయకులు శివకవి ముకుంద ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. మానవ చరిత్ర మలుపుల గుట్టు విప్పిన మహోన్నతుడు కారల్‌మార్క్స్ అని అన్నారు. మానవశ్రమే అన్నింటికీ మూలమని, మానవత్వాన్ని గౌరవించాలని అన్నారు. నాయకులు చంద్రకళ, విజయలక్ష్మి, వేలు, సుధాకర్, ఎన్.ముకుంద, ప్రతాప్ పాల్గొన్నారు.

టీటీడీ క్రీడా పోటీల్లో సెమీ ఫైనల్‌కు చేరుకున్న మస్తాన్ జట్టు

ప్రజాశక్తి -తిరుపతి సిటి

టీటీడీ క్రీడా పోటీల్లో భాగంగా గురువారం జరిగిన క్రికెట్ పోటీలలో మస్తాన్ జట్టు గెలుపొంది సెమీఫైనల్కు చేరుకుంది. స్థానిక వెటర్నరీ యూనివర్సిటీ గ్రౌండ్లో జరిగిన మ్యాచ్లో జె టీ మీద ఈ టీం 191 రన్స్ తో గెలిచి సెమీ ఫైనల్ కి క్వాలిఫై అయ్యింది.మొదట బ్యాటింగ్ చేసిన ఈ టీం కెప్టెన్ మస్తాన్ వ్యక్తిగత స్కోరు 143 రన్స్ అవుట్ ఆఫ్ 66 బాల్స్ లో ఇప్పటివరకు జరిగినటువంటి టోర్నమెంట్లో హైయెస్ట్ వ్యక్తిగతమైన స్కోరు కైవసం చేసుకుంది. ఇప్పటివరకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్ లో అత్యధిక పరుగులు సాధించినటువంటి ఈ టీం 191 పరుగులు నిర్ణీత 15 ఓవర్లో నమోదు అయ్యింది. మస్తాన్ కెప్టెన్ ఇన్నింగ్స్ 143 పరుగులు 66 బాలులో 18 ఫోర్లు, ఐదు సిక్స్ లు కొట్టి మేన్ అఫ్ ది ప్లేయర్గా నిలిచాడు.

కాంగ్రెస్ అభ్యర్థిగా ఆశీర్వదించండి : పైమూరు మురగయ్య

ప్రజాశక్తి - నాయుడుపేట

సూళ్లూరుపేట నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా తనను ఆశీర్వదించి సేవ చేసుకునే అవకాశం కల్పించాలని పైమూరు మురగయ్య వేడుకున్నారు. శ్రీకాళహస్తి మాజీ ఎంఎల్ఎ తాడిపత్రి చెంచురెడ్డి అనుచరుడుగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా బాధ్యతలు నిర్వహించానన్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన తాను ఇపుడు సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు. తన మామ దొరవారిసత్రం మండలం తల్లంపాడు గ్రామానికి చెందిన మేర్లపాక మునస్వామి అని, గతంలో రెండుసార్లు వరుసగా సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా గెలుపొందారన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో కనుమరుగై పోతున్న కాంగ్రెస్ పార్టీకి వైఎస్ షర్మిల రాకతో పూర్వ వైభవం సంతరించుకుందన్నారు.

అసాధారణ మేధావి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

ప్రజాశక్తి - రేణిగుంట, క్యాంపస్

భౌతికశాస్త్రంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చిన అసాధారణ మేధావి ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ అని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు ఒ.వెంకటరమణ అన్నారు. గురువారం ఐన్‌స్టీన్ జయంతిని విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. జెవివి కన్వీనర్ కుప్పస్వామి మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో అనేక విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఆర్‌సిఎం హైస్కూల్ విద్యార్థులతో ఈ వేడుక జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సైన్స్ మానవ కల్యాణానికి తోడ్పడాలన్నారు.

జెవివి ఆధ్వర్యంలో కిరణ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూలు విద్యార్థులో ఐన్‌స్టీన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పోలీసు ఇన్‌స్పెక్టర్ మురళీమోహన్, ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. విద్యార్థులు మూఢనమ్మకాలను వదిలిపెట్టాలన్నారు. అమీర్, జయరాంరెడ్డి, రఫి, రమణ, కుప్పస్వామి, శశికళ, బాలోత్సవం నాయకులు ఎం.నాగార్జున పాల్గొన్నారు.

నాయుడుపేటలో భూకంపం

ప్రజాశక్తి నాయుడుపేట

నాయుడుపేట పట్టణంలో గురువారం రాత్రి 8 గంటల 45 నిమిషాల సమయంలో సుమారుగా ఐదు సెకండ్ల పాటు భూమి కంపించింది. ఈ సంఘటనతో ఏం జరుగుతుందో అర్థం కాక భయభ్రాంతులకు గురైన ప్రజలు ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. బలమైన భూకంపం సంభవించినట్లు రిక్టర్ స్కేల్ పై భూకంప తీవ్రత 4.8 గా నమోదైనట్లు జాతీయ భూకంప కేంద్రం నిర్ధారించింది. నాయుడుపేటలోనే గాక సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం, సూళ్లూరుపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో భూకంపం సంభవించినట్లు తెలిపారు.